విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



కవ్వగూడ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాలరాజు

శంషాబాద్ రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని యువ నాయకుడు కుక్కల బాలు అన్నారు. మండలంలోని కవ్వగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ఇందులో భాగంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు తన వంతు సహకారం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాసం



శంషాబాద్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి కొత్తగా చేరిన చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. విద్యార్థుల తల్లిదండ్రులు అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంప్రదాయ వేడుకల కలయికతో విద్యాభ్యాసం చేపట్టడంతో పిల్లకు మన సంస్కృతి పట్ల గౌరవం పెరుగుతుందని ప్రిన్సిపాల్ వసంత అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్:వైద్యుల సేవలు ఎనలేనివని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వైద్యులను సోమవారం ఆమె ఘనంగా సన్మానించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులో తమ ప్రాణాలు ఫణంగా పెట్టి వైద్యులు సేవలందించారన్నారు. వైద్యులు దేవుడి సమానమన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్, ది సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు డి.సీతారాం జన్మదినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులతో పాటు మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వసంతరావు, మాజీ ఎంపీపీ, పార్టీ సమన్వయ కర్త తలారి మల్లేష్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లోని వివిధ ట్రేడ్స్‌లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 18 ఆఖరు అని, కౌన్సిలింగ్ 22వ తేదీ ఉదయం9.30 గంటలకుగచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో జరుగుతుందన్నారు. దరఖాస్తులను యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో ఉంటాయని, వాటిని డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 040-23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేత

రాయదుర్గం: విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించామని, హెచ్‌సీయూలో ప్రశాంత వాతావరణం పెంపొందించేందుకు కట్టుబడి ఉన్నామని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు విద్యార్థులు పక్షపాత ఆరోపణలు చేస్తున్నారని, అవి పూర్తిగా నిరాధారమైనవన్నారు. సస్పెన్షన్ ఎత్తివేతతో బాటు పెనాల్టీని విధించాలని నిర్ణయించామని తెలిపారు. తద్వారా విద్యార్థులు తమ విద్యను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు వీలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిర్ణయాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కాగా జరిమానాల రూపంలో సేకరించిన నిధులను గురుబక్ష్ సింగ్(హెచ్‌సీయూ మొదటి వైస్‌చాన్స్‌లర్) విద్యార్థుల సహాయ నిధిలో జమ చేయబడుతుందని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కౌసర్‌కు ఆహ్వానం

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల నిర్వహణకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ కోట బోనాల ఆహ్వాన పత్రికను సోమవారం జగదాంబిక మహంకాళి అమ్మవార్ల వృత్తిపని సంఘం వారు సోమవారం ఆయనను సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల నిర్వహణకు మజ్లిస్ పార్టీ పూర్తి సహాయ సహకారాలను అందిస్తు వస్తుందన్నారు. బోనాల విషయంపై తాను ఈ పాటికే పోలీసులు, ట్రాఫిక్, బల్దియా, జలమండలి అధికారులతో మాట్లాడానన్నారు. మొదటి బోనం జూలై 7న ప్రారంభం అవుతుందని, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి ఎమ్మెల్యేకు తెలిపారు.

అయినా వారే 'కీ'లకం

- మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
- ఆరోపణలున్నా ప్రధాన బాధ్యతలు
- ఉన్నతాధికారుల వత్తాసు
- బర్త్,డెత్ సర్టిఫికెట్‌ల జారీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతికే 'కీ'
- గతంలో కమిషనర్ డిజిటల్ కీ తో అనుమతులు జారీ చేసిన ఉద్యోగి
- సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం



శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్: ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారి చేతికే 'కీ' బాధ్యతలు.. తప్పుల మీద తప్పులు చేస్తున్నా వారినే వెనకేసుకొస్తూ 'కీ' ఇస్తున్న ఉన్నతోద్యోగులు.. మున్సిపాలిటీలో గత ఐదేళ్లలో కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అవినీతిపై ఫిర్యాదులు వెల్లువెత్తినా పట్టించుకోకపోవడంలో మతలబు..మర్మమేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు..

ఆటో రిక్షాతో వచ్చి..

ఐదేళ్ల క్రితం చెత్త ఆటో రిక్షాతో కాంట్రాక్టుతో మున్సిపాలిటీలో ఎంట్రీ ఇచ్చిన ఓ వ్యక్తి ఆ తర్వాత ఉన్నతోద్యోగి పరిచయంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా మారాడు.. గత కొంత కాలంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో మున్సిపల్ కమిషనర్ డిజిటల్ 'కీ' సైతం తన దగ్గర పెట్టుకుని జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా జారీ చేసినట్లు ఇటీవల ఉన్నతాధికారులు సైతం గుర్తించారు. అంతేకాకుండా ఒక్కో పత్రానికి రూ. 5 నుంచి రూ.6 వేలకుపైగా వసూలు చేస్తున్నట్లు స్వయంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. అతడిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారుల పరిశీలనలో ఆరోపణలు నిజమని నిగ్గుతేలినా చర్యలు తీసుకుంటే బయటికి బద్నాం అయితామన్న ఉద్దేశంతో చర్యలకు మిన్నకుండిపోయారు. అవినీతి ఆరోపణలున్నా అతడిపై కొందరు ఉన్నతాధికారులు ఎందుకంత ప్రేమ చూపుతున్నారని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పారిశుద్ధ్య విభాగంలో..

పారిశుద్ధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక బాధ్యతలు కట్టబెట్టారు. ఉద్యోగ కోడ్ రీత్యా ఖాకీ ప్యాంటు, తెల్ల చొక్కాతో ఉండాల్సిన సదరు ఉద్యోగి యునిఫాం కూడా వేసుకోకుండా సివిల్ దుస్తులు, ఖద్దరు చొక్కాలు వేసుకుని ప్రభుత్వ ఉద్యోగులపై సైతం అజమాయిషీ చెలాయిస్తున్నాడు. ఇతడి వైఖరి భరించలేని సామాజిక కార్యకర్తలు, సమాచార హక్కు కార్యకర్తలు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పాటు సంబంధిత ఉద్యోగి వివరాలు కోరినా అధికారులు మాత్రం వెల్లడించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులపైనే పెత్తనం చెలాస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక మతలబేమిటో అర్థం కావడం లేదు.. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్‌తో పాటు పలు విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తీరుపై అనేక ఆరోపణలున్నా అధికారులు వారిని వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలోనూ అనేకం..

గతంలో మున్సిపాలిటీలో పనిచేసిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మున్సిపల్ కమిషనర్ డిజిటల్ కీతో జీవో 111లో సైతం దాదాపు ముప్పైకి పైగా అనుమతులు జారీ చేశాడు. ఆ తర్వాత తెరుకున్న సదరు ఉన్నతాధికారి అతపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి అనమతులు రద్దు చేశాడు. అదే విధంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు ఓ ప్రభుత్వాధికారి, తపాలా కార్యాలయం అధికారి కలిసి చనిపోయిన వారి పేరును కొనసాగిస్తూ భారీ మొత్తంలో పింఛన్లు నొక్కేశారు. దీనిపై నామమాత్రం విచారణ చేపట్టి పక్కన పడేశారు.

సరిపడా ఉద్యోగులున్నా..

రెవెన్యూ తదితర విభాగాల నుంచి వచ్చిన ఉద్యోగులున్నా నేటికి కీలక బాధ్యతలు తమకు అనుకూలమైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కట్టబెట్టడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని ప్రజాప్రతినిధులు, పట్టణ పౌరులు చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగాలు పూర్తి అవినీతి మయంగా మారాయని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉద్యోగులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోరు. శంషాబాద్ మున్సిపాలిటీలో పౌరసేవలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. కొన్ని విభాగాలు అవినీతిమయంగా మారాయి.

- అక్రమ్‌ఖాన్- శంషాబాద్

బాధ్యతల నుంచి తప్పించాం..

ఆరోపణలు వచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. వారిని కీలక బాధ్యతల నుంచి తొలగించి ప్రభుత్వ ఉద్యోగుల చేతికే ఇస్తున్నాం. ఆరోపణలపై విచారణ చేపడుతున్నాం. డిజిటల్ కీ నా వద్దనే ఉంది. అన్ని రకాలుగా పరిశీలించిన తర్వాతే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశాం. అవినీతికి అవకాశం లేకుండా పౌరసేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- బి. సుమన్‌రావు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

విద్యార్థినికి ఆర్థిక సాయం



సంజనకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్: పట్టణంలోని వివేకానంద కాలనీలోని హిందు వికాస్ గణేష్ ఉత్సవ సమితి తరపున అదే ప్రాంతానికి చెందిన నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. బీటెక్ చదువుతున్న సంజనకు ఉత్సవ సమితి తరపున రూ. 50 వేల నగదును అందజేశారు. పేద విద్యార్థి చదువు హిందువికాస్ గణేష్ ఉత్సవ సమితి అండగా ఉంటుందని సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి రఘునాథ్‌రెడ్డి తెలిపారు.

పల్లె ప్రజల అభ్యున్నతికి పాటుపడతాం



గచ్చిబౌలి: మారుమూల ప్రాంతాలకు శాఖలను విస్తరింప జేసి పల్లె ప్రజల అభ్యున్నతికి పాటుపడతామని ఎస్‌బీఐ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్, జీఎం జీవీ శాస్త్రీ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఎస్‌బీఐఆర్‌డీలో నిర్వహించిన స్టేట్ బ్యాంక్ డే ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాల కంటే ఖాతాదారుల విశ్వాసం, సంతృప్తికే పెద్ద పీట వేసినట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రముఖ సంగీత విద్వాంసులు రామాచారి గానం, చలన చిత్ర గాయకులు సాయిచరణ్, హారిణి పాటలతో అలరించారు. ఎస్‌బీఐఆర్‌డీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.బాలాజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు మేళాలో పాల్గొన్న ప్రాజెక్టు ఆఫీసర్ రేణుక

బండ్లగూడ: పౌష్టికాహరంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రాజెక్టు ఆఫీసర్ రేణుక అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న బరువుల మేళా కార్యక్రమంలో భాగంగా సోమవారం బండ్లగూడలోని కేంద్రాన్ని ఆమె సూపర్‌వైజర్ మణెమ్మతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల బరువు, ఎత్తు స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో బరువుల మేళా జరుగుతుందన్నారు. పిల్లలకు ఎత్తు, బరువు తీయించి పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు ఇవ్వాలని, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయం 17వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పూజల్లో పలు కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని అలంకరించారు. విద్యుద్ దీపాలతో పాటు వివిధ రకాల పూలతో దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, పోచమ్మ దేవాలయం అధ్యక్షులు ఉమారెడ్డి, దేవాలయ పూజారి రంగనాథ్ శర్మ, కిరణ్, ఎం.యాదమ్మ యాదవ్, వేణుగోపాల్, పి.వెంకటస్వామి, ఇ.వేణుగోపాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో వసతుల కల్పనకు కృషి



మంచిరేవులలో బోరు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని అన్ని శ్మశాన వాటికల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించి వాటిని నందన వనాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల వీరశైవలింగాయత్‌ల శ్మశానవాటికలో బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో బోరు పనులను ప్రారంభించామన్నారు. ఇదే తరహాలో రాబోయే రోజుల్లో అన్ని శ్మశాన వాటికల్లో సౌకర్యాలను కల్పించేందుకు కౌన్సిలర్‌లతో కలిసి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు లంకల పద్మ వీరారెడ్డి, కె. ఉషారాణి, డీఈ నరసింహారాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు అనిల్, అరుణ్, మాజీ వార్డు సభ్యుడు దామోదర్‌రెడ్డి, నాయకులు విశ్వనాథ్, వినోద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

బండ్లగూడ: విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆమె కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, ఆసియాఖాజాలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అన్ని రంగాలతో పాటు విద్యారంగాన్ని కూడా మునుపెన్నడూ లేని విధంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు నూపొందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌గౌడ్, ఖాజాపాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

చోరీ కేసులో నిందితులకు జైలు

రాజేంద్రనగర్: చోరీ కేసులో ఇద్దరు నిందితులకు రాజేంద్రనగర్ 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంగీత కథనం మేరకు. శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో 2023 సెప్టెంబర్ 28న కాటేదాన్‌కు చెందిన సుమిత, వారాసిగూడకు చెందిన జహంగీర్ (39) చోరీకి పాల్పడ్డారు. ఆసుపత్రిలోని సీసీ కెమెరాలు, మానిటర్, రూటర్, హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆర్‌జీఐ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం నిందితులకు ఎడాడి జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



విష్ణు మృతదేహం

శంషాబాద్: ఓ వ్యక్తి ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సిద్ధాంతి బస్తీలో నివాసముండే పల్లెమోని విష్ణు(28) వివాహమై ఓ కుమార్తె ఉంది. రెండేళ్లగా భార్యభర్తలు మనస్పర్థలు రావడంతో వేరుగా ఉంటున్నారు. మద్యానికి బానిసైన విష్ణు సోమవారం ఉదయం ఇంట్లో రేకులకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కొత్త చట్టం బీఎన్ఎస్ఎస్ కింద 194 కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయి గణేష్ (ఫైల్)



బోల్తాపడిన కారు

రాజేంద్రనగర్: అర్ధరాత్రి సినిమా చూసి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మైలార్‌దేవ్‌పల్లి ప్రగతి కాలనీ ప్రాంతానికి చెందిన సాయి గణేష్ (25) జల్‌పల్లిలో ప్లాస్టిక్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో నగరంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసి తన థార్ జీపులో ఇంటికి బయలుదేరాడు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ 296 వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు నాలుగు పల్టీలు కొట్టి ఎక్స్‌ప్రెస్ వే రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ సంఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న సాయి గణేష్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ సంఘటన చోటు చేసుకోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. వాహనాన్ని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



సువర్ణ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లక్ష్మిగూడ రాజీవ్ గాంధీ గృహకల్పలో నివాసం ఉంటున్న గిరిబాబు, సువర్ణ దంపతులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో శుక్రవారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి లోనైన సువర్ణ(38) ఇంటి నుండి బయటికి వెళ్లి తిరిగా రాలేదు. ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం సాయంత్రం ఆమె భర్త గిరిబాబు పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళలకు గాయాలు

సుల్తాన్‌బజార్: కారు ఢీకొని ఓ మహిళకు గాయాలయిన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిది. 125 బీఎన్ఎస్ క్రైమ్ నెంబర్: 173/2024 చట్టం ప్రకారం..మధ్యాహ్నం 2 గంటలకు ఈ కేసు నమోదు అయ్యింది. సంబంధిత వివరాల ప్రకారం... ఎల్బీనగర్‌కు చెందిన దివ్య(29) ఉదయం 10.40 గంటలకు రాంకోఠి నుంచి సుల్తాన్‌బజార్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. అదే ప్రాంతంలో ఓ కారు ఆమెను ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం సైతం ధ్వంసం కావడంతో స్థానికుల సాయంతో ఆమె సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

పోలీసుల అదుపులో నిందితులు



మృతుడు సయ్యద్ హిదాయత్ ఆలీ (ఫైల్)

మణికొండ: గతంలో ఉన్న వివాహేతర సంబంధాన్ని తిరిగి కొనసాగించాలని కోరిన వ్యక్తిని ఓ మహిళ తన ప్రియుడితో కలిసి హత్యచేసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సోమవారం తెలిపిన మేరకు.. గోల్కొండ చోటా బజార్‌లో ఉంటున్న సయ్యద్ హిదాయత్ ఆలీ(31) సివిల్ ఇంజనీర్‌గా పనిచేసేందుకు రెండు సంవత్సరాల క్రితం దుబయ్‌కు వెళ్లాడు. అంతకు ముందు అతనికి అదే ప్రాంతంలో ఉంటున్న సీమాబేగం (24)తో వివాహేతర సంబంధం ఉంది. సయ్యద్ హిదాయత్ ఆలీ దుబయ్‌కు వెళ్లిన తరువాత సీమా బేగం ఫలక్‌నామాలోని తీగలకుంటకు చెందిన సయ్యద్ అమీర్ (29)తో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. అయితే దుబాయ్‌నుంచి ఇటీవల తిరిగి వచ్చిన హిదాయత్ ఆలీ తిరిగి వచ్చాడు. ఆమెను కలిసి తిరిగి తనతో వివాహేతర సంబంధం కొనసాగించాలని ఒత్తిడి చేశాడు. ఈ విషయం సీమబేగం అమీర్‌కు తెలిపింది.

చంపాలనే పథకం వేసి...

దీంతో ఇద్దరూ కలిసి హిదాయత్ ఆలీని చంపాలని నిర్ణయించుకున్నారు. అతనితో మంచిగా మాట్లాడి బయటకు తీసుకుని రావాలని సీమబేగంకు తెలిపాడు. దీంతో సీమా బేగం జూన్ 29వ తేదీన హిదాయత్ ఆలీతో కలిసి అతని క్వాలీస్ వాహనంలోనే ముందుగా వేసుకున్న పథకం ప్రకారాం నిర్మానుష్యంగా ఉండే మంచిరేవుల గ్రీన్‌ల్యాండ్ కాలనీ వైపు తీసుకుని వచ్చింది. వారిని అనుసరిస్తూ బైక్‌పై వచ్చిన సయ్యద్ అమీర్ అక్కడకు వచ్చి హిదాయత్ ఆలీతో గొడవకు దిగాడు. ఓ ప్రహరీ పక్కకు తీసుకుని వెళ్లి కత్తితో పలుమార్లు విచక్షణారహితంగా పొడవటంతో తీవ్ర రక్తస్రావం జరిగి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు నిందితులు బైక్‌పై అక్కడినుంచి పరారయ్యారు.

ఐడీ ప్రూఫ్ ఆధారంగా విచారణ...

మృతుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా అతని ఇంటికి వెళ్లి విచారణ చేయటం, స్థానికంగా ఇద్దరు వ్యక్తులు, ఓ బురఖా వేసుకున్న మహిళ మధ్య అక్కడ గొడవ జరిగిందనే విషయం తెలుసుకున్న పోలీసులు ఆ దిశగా విచారణ మొదలు పెట్టారు. మృతుని చిరునామాకు వెళ్లి విచారణ చేయగా గతంలో సీమాబేగంతో ఉన్న వివాహేతర సంబంధం తెలిసింది. ఆకోణంలో విచారణ చేయగా ఆమెతో పాటు సయ్యద్ అమీర్‌ను ఆదివారం రాత్రి షాహీన్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరం అంగకరించారు. దాంతో నిందితులను సోమవారం కోర్టులో హజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.